
సాక్షి
బాపట్ల
సోమవారం । 3 । మార్చి । 2025



మహారుద్రాభిషేకం


రొంపిచర్ల: మండలంలోని విప్పర్లలో గల గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహారుద్రాభిషేకం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 528.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 6,006 క్యూసెక్కులు విడుదలవుతోంది.

మావుళ్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ట



కొల్లూరు: మండలం లోని చినపులివర్రు శివారు గురివిందపల్లిలో నూతంగా నిర్మించిన ఆలయంలో గ్రామ దేవత మావుళ్లమ్మ విగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవం ఆదివారం నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహరి (మంగళ)
బాపట్ల	6.21	5.08
నరసరావుపేట	6.13	5.10
గుంటూరు	6.22	5.10

న్యూస్‌రీల్

అమరేశ్వరుడి సేవలో ఐజీ హరికృష్ణ



అమరావతి: ప్రముఖ శైవ క్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరుడిని ఆదివారం ఐజీ హరికృష్ణ, ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ శ్రీరాములునాయక్‌లు కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు తొలుత వారికి స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరుడికి, బాల చాముండేశ్వరీ అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి, స్వామి వారి శేషవస్త్రంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో ఒత్తిడి దూరం



నరసరావుపేట: పోలీసుల విధి నిర్వహణలో ఎదురయ్యే అధిక ఒత్తిడిని యోగా, ధ్యానంతో అధిగమించవచ్చునని పరిపాలనా విభాగ అదనపు ఎస్పీ జేవీ సంతోష్ పేర్కొన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్త వారోత్సవాలలో భాగంగా ఆదివారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మహిళా పోలీసు సిబ్బంది, సచివాలయం మహిళా పోలీసులకు యోగా, ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు జనార్దనరావు పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చారు. స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ పాల్గొన్నారు.

రేపు బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

బాపట్ల: గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక మంగళవారం 2గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. 30–3–2009 తరువాత పుట్టిన వారై ఉండాలని, 55 కేజీల్లోపు బరువు ఉండాలని ఆయన వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు తీసుకురావాలని ఆయన సూచించారు.

శింగరకొండ తిరునాళ్లకు ట్రాఫిక్ మళ్లింపు

అద్దంకి రూరల్: ఈనెల 14వ తేదీ శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా అద్దంకి వైపు వచ్చే వాహనాలను, ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు చీరాల డీఎస్పీ మొయిన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు వెళ్లే వాహనదారులు సంతమాగులూరు క్రాస్ రోడ్ , నరసరావుపేట నుంచి చిలకలూరిపేట మీదుగా వెళ్లాలి. ఒంగోలు వైపు, దర్శివైపు వెళ్లేవారు సంతమాగులూరు క్రాస్ రోడ్ నుంచి వినుకొండ, కురిచేడు మీదుగా దర్శి వైపునకు వెళ్లాలి. రేణింగవరం నుంచి అద్దంకి మీదుగా దర్శివైపు వెళ్లేవారికి మేదరమెట్ల హైవే మీదుగా, ఒంగోలు నుంచి హైదరాబాద్ వెళ్లేవారు మేదరమెట్ల మార్టూరు వైపు హైవే మీదుగా వెళ్లాలి. దర్శి నుంచి అద్దంకి మీదుగా హైదరాబాద్ వెళ్లే వారు కురిచేడు, వినుకొండ, సంతమాగులూరు క్రాస్ రోడ్డు వైపునకు ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు ఆదివారం తెలిపారు. 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 15వ తేదీ ఉదయం 10 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు అమల్లో ఉంటుందని తెలిపారు. పైన నిర్ణయించిన సమయంలో కట్టెలు, గడ్డి, పొట్టు ట్రాక్టర్ల కు ప్రవేశం లేదని ఆయన స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సులకు, అంబులెన్స్‌లకు మాత్రమే ప్రవేశం ఉంటుందని డీఎస్పీ మొయిన్ పేర్కొన్నారు.

చేనేతల్లో కలత

- బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యం
- చేనేతలకు పూర్వ వైభవం తెస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన చంద్రబాబు
- పైసా విదల్చక పోవడంతో కార్మికుల్లో నిరాశ



మగ్గం నేస్తున్న కార్మికుడు (ఫైల్)

చీరాల: చేనేతలపై కూటమి ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ ప్రదర్శించింది. బడ్జెట్ కేటాయింపులలో రిక్త హస్తం చూపింది. కేవలం 0.043 శాతం కేటాయింపులు చేసి కపట ప్రేమ చూపించింది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్యాయం చేసింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి చేనేతలు వెన్నంటే ఉన్నారని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు వారి సంక్షేమానికి బడ్జెట్‌లో మాత్రం పైసా విదిల్చలేదు. రాష్ట్రంలో చేనేత మగ్గాలపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా చేనేత ఉప వృత్తుల వారితో కలిపి ఐదు లక్షల మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. నేడు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చేనేత వర్గాలకు ఆందోళన కలిగిస్తోంది.

కేటాయింపులు నిల్ ?

- చేనేతల ఆరోగ్య భద్రతను తన బాధ్యతగా స్వీకరిస్తున్నానని చెప్పి హెల్త్ ఇన్సూరెన్స్ పథకానికి రూ.10కోట్లను చేనేత దినోత్సవం రోజున విజయవాడలో చంద్రబాబు ప్రకటించారు. కానీ బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదు.
- చేనేతలపై పెనుభారంగా ఉన్న జీఎస్టీని రద్దు చేయించేందుకు కట్టుబడి ఉన్నామన్న ఆయన కేంద్రంతో చర్చిస్తామని చెప్పి మొండిచెయ్యి చూపించారు.
- ఎన్నికల ముందు చీరాల్లో హ్యాండ్ లూమ్ పార్కు ఏర్పాటు చేయించి చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు, వస్త్రాలకు మార్కెటింగ్ కల్పిస్తానని హామీ ఇచ్చారు. తీరా బడ్జెట్‌లో ఆ ఊసే లేదు.
- నేతన్న నేస్తం పథకానికి గత ప్రభుత్వం ఏడాది రూ.24వేలు కేటాయించింది. కానీ ప్రస్తుత ప్రభుత్వఆ పథకం మాటే లేదు.
- నూలు సబ్సిడీ, స్థానిక మార్కెట్ అవకాశాలు పెంపొందించుకునేందుకు వినియోగదారులకు వస్త్ర కొనుగోలుపై ఇచ్చే 20శాతం రిబేట్ ఊసేలేదు.

కలగానే చేనేత సహకార సంఘాల ఎన్నికలు

2018 నుంచి చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. అఫీషియల్ పర్సనల్ ఇన్‌చార్జిలతో నడిపిస్తున్నారు. ఎన్నికలు నిర్వహించేంత వరకు సంఘ సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేసి కార్మికులకు ఇబ్బంది లేకుండా పని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సంఘ నాయకులు కోరుతున్నారు. చేనేతలకు నేరుగా లబ్ధిపొందే త్రిఫ్ట్ ఫండ్ పథకం , పరికరాల కొనుగోలు, నూలు సరఫరా సబ్సిడీ, ఉత్పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, చేనేతల రుణమాఫీ, పావలా వడ్డీ చెల్లింపులకు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో చర్చించి సవరణల ద్వారా కేటాయింపులు చేయాలని కోరుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బడ్జెట్‌లో చేనేతలకు మొండి చెయ్యి



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతలకు మొండి చెయ్యి చూపించింది. ఇప్పటికే వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. బడ్జెట్‌లో కేటాయింపులు సక్రమంగా జరగలేదనే బాధ చేనేతల్లో నెలకొంది. ఎన్నికల ముందు చెప్పిన మాటలకు, అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ చర్యలకు పొంతన లేదు.

– దేవన వీరనాగేశ్వరరావు, రాష్ట్ర జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

హెల్త్ ఇన్సూరెన్స్ ఊసే లేదు



హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలుకు రూ.10కోట్లు ప్రకటించి కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు జరగలేదు. చేనేత సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని నమ్మబలికి ఈ బడ్జెట్‌లో ఆయా పథకాల ప్రస్తావన లేకపోవడం సబబుగా లేదు. కార్మికులంతా నిరుత్సాహంలో ఉన్నారు.

–సజ్జా శ్రీనివాసరావు, శుభోదయ చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు



గుంటూరు ఏసీ కాలేజీలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు

‘మండలి’ గెలుపు ఎవరిదో ?

- నేడు ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- కూటమి , పీడీఎఫ్ వర్గాల్లో ఉత్కంఠ
- ఫలితం కోసం ఆసక్తిగా ఎదురుచూపులు
- జిల్లాలో ఓటుహక్కు వినియోగించుకున్న 18,200 గ్రాడ్యుయేట్స్
- ఏర్పాట్లు పూర్తి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కౌంటింగ్ సోమవారం గుంటూరు ఏసీ కాలేజీలో జరగనుంది. ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గత నెల 27న పోలింగ్ జరిగింది. జిల్లాలోని బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పరిధిలో మాత్రమే ఎన్నికలు జరిగాయి. మొత్తం 24,493 మందికి గాను 18,200 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. కూటమి తరపున ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ తరపున బరిలో నిలిచిన కేఎస్.లక్ష్మణరావుల మధ్యే ప్రధాన పోటీ జరిగింది. ఈ ఎన్నికల్లో మొత్తం 25 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. సోమవారం జరగనున్న ఓట్ల లెక్కింపుతో వీరి భవితవ్యం తేలనుంది. కౌంటింగ్ నేపథ్యంలో కూటమి , పీడీఎఫ్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఓటర్లు, ప్రజల్లో కూడా లెక్కింపుపై మరింత ఆసక్తి నెలకొంది. కూటమి, పీడీఎఫ్ వర్గాలు ఎవరికి వారు గెలుపుపై ధీమాగా ఉన్నారు.

కూటమి నేతల్లో టెన్షన్

పోలింగ్ రోజు కూటమి నేతలు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని, ప్రధానంగా దొంగ ఓట్లు వేసుకోవడంతోపాటు పలు చోట్ల తమ నాయకులు, ఏజెంట్లపై దాడులు చేసి రిగ్గింగులకు పాల్పడ్డారని పీడీఎఫ్ వర్గాలు ఆరోపించాయి. పలు అక్రమాల నేపథ్యంలో తమ గెలుపు ఖాయమని కూటమి నేతలు పైకి గంభీరంగా చెబుతున్నారు. అయితే, ఉద్యోగులు, నిరుద్యోగుల్లో కూటమి సర్కార్‌పై తొమ్మిది నెలల్లోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది ఈ ఎన్నికల్లో మరింతగా ప్రభావం చూపించే అవకాశముందని కూటమి వర్గాలు లోలోపల టెన్షన్‌గానే ఉన్నాయి. పైగా భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీ వర్గాలు కూటమి అభ్యర్థి ఆలపాటిపై వ్యతిరేకతతో ఉన్నాయి. ఇది మరింతగా నష్టం చేసేఅవకాశముందని అంతర్గతంగా చర్చ జరుగుతోంది. మరోవైపు కూటమి ఎన్నికల అక్రమాలకు తెగబడినా ఉద్యోగులు, పట్టభద్రుల ఓట్లతో తాము విజయం సాధిస్తామని పీడీఎఫ్ వర్గాలు ధీమాగా ఉన్నాయి. మొత్తంగా సోమవారం జరగనున్న ఓట్ల లెక్కింపుతో ఎవరు విజయం సాధిస్తారో తేలనుంది.

గుంటూరు రేంజ్‌కు 53 మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలు

- జిల్లాల వారీగా కేటాయింపులు
- నియామక ఉత్తర్వులు జారీచేసిన రేంజ్ ఐజీ



ప్రొబేషనరీ ఎస్‌ఐలతో మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

నగరంపాలెం: సమర్థంగా విధులు నిర్వర్తించాలని, విధి నిర్వహణలో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ప్రొబేషనరీ ఎస్‌ఐలకు సూచించారు. శిక్షణ పూర్తయి, గుంటూరు రేంజ్ పరిధిలో విధుల నిర్వహించేందుకు ఎంపికైన 53 (36 మంది పురుషులు, 17 మంది మహిళలు) మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలు ఆదివారం గుంటూరు నగరంలోని గుంటూరు రేంజ్ కార్యాలయంలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని తెలిపారు. అనంతరం జిల్లాలు కేటాయిస్తూ నియామక ఉత్తర్వులను ఐజీ అందించారు. గుంటూరు జిల్లాకు 22 మంది, పల్నాడు జిల్లాకు 13, బాపట్ల జిల్లాకు 10, ప్రకాశం జిల్లాకు ఒకరు, శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లాకు ముగ్గురు, తిరుపతి జిల్లాకు నలుగురిని కేటాయించారు. ఈనెల 2వ తేదీ నుంచి 6 వరకు పీఎస్‌ఐలకు సెలవులని ఐజీ తెలిపారు. అనంతరం ఈనెల 7వ తేదీ నుంచి గ్రేహౌండ్స్ శిక్షణకు పంపిస్తామని వెల్లడించారు. అనంతరం పీఎస్‌ఐలతో ఐజీ మాట్లాడారు.

అంకెల గారడి.. కూటమి బురిడి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

- ప్రజలను మోసం చేసిన చంద్రబాబునాయుడు
- మాజీ డెప్యూటీ స్పీకర్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోన

బాపట్ల: రాష్ట్ర ప్రజలను చంద్రబాబునాయుడు అంకెల గారడీతో మళ్లీ మోసం చేశారని మాజీ డెప్యూటీ స్పీకర్, వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కోన రఘుపతి ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌ను రూ.3.22లక్షల కోట్లతో ప్రవేశపెట్టడం చూస్తుంటే అంకెల గారడీగా ఉందని తెలిపారు. రూ.72వేల కోట్లు అప్పు ఉంటేనే గగ్గోలు పెట్టిన చంద్రబాబునాయుడు ఇప్పుడు లక్ష కోట్లు ఏవిధంగా అప్పులు చేశారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.40వేల కోట్లు అవసరమని చెప్పిన ఆయన ఇప్పుడు రూ. 6వేల కోట్లు మాత్రమే కేటాయించడం ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని విమర్శించారు. పింఛన్లకు రూ.26వేల కోట్లు మాత్రమే కేటాయించడం గమనిస్తే, ఎంత మందివి తొలగించేందుకు కుట్ర జరుగుతుందో అర్థం కావడం లేదని తెలిపారు. మరోవైపు బీసీలకు 50సంవత్సరాలకే పింఛన్లు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.ఉచిత బస్సు, తల్లికి వందనం, రైతుల గురించి పట్టించుకోలేదని చెప్పారు. మత్స్యకారులకు గత ఏడాది భరోసా కింద రూ.20వేలను ఇవ్వకుండా ఈ ఏడాది ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. జగనన్న కాలనీల అభివృద్ధి పట్టించుకోకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. కొత్త జిల్లాలకు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.100కోట్లు చొప్పున కేటాయించగా, ఈ ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోలేదని విమర్శించారు. మెడికల్ కళాశాలల గురించి ఊసే లేదని తెలిపారు. బడ్జెట్ ద్వారా చంద్రబాబునాయుడు హడావుడి నిర్ణయాలు చూస్తుంటే 2027లో జమిలి ఎన్నికలకు సిద్ధం అవుతున్నట్లు కనిపిస్తోందన్నారు. ప్రజల్లో వైఎస్సార్ సీపీపై విశ్వాసం ఉందని, వారికి అండగా ఉండేందుకు పార్టీ సిద్ధంగా ఉందని కోన స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, పార్టీ మండల అధ్యక్షులు మురుప్రోలు కొండలరెడ్డి, నాయకులు జోగి రాజా, కృష్ణ గుప్తా, కటికల యోహోషువా, పిన్నిబోయిన ప్రసాద్, శాయిల మురళి, నర్రా వెంకట్రావు, ఉరబిండి గోపి, తన్నీరు అంకమ్మ, డి.కోటిరెడ్డి పాల్గొన్నారు.

ముం‘చెత్త’న కోటప్పకొండ

- కోటప్పకొండలో పేరుకుపోయిన చెత్త
- తిరునాళ్లతో భారీగా పేరుకుపోయిన వ్యర్థాలు
- నాలుగు రోజులైనా పారిశుద్ధ్య పనులు శూన్యం
- గుట్టలుగా పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన
- అధికారుల తీరుపై మండిపడుతున్న భక్తులు



ప్రధాన రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్త



నాలుగు రోజులుగా కుప్పలుగా గోతాలలో వ్యర్థాలు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ పుణ్యక్షేత్రం చెత్తతో నిండిపోయింది. తిరునాళ్లతో పోగైన వ్యర్థాలను తొలగించడంలో పంచాయతీ రాజ్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ చూసినా గుట్టలుగా వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారుల వెంట కుళ్లిన వాటితో దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులతోపాటు భక్తులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ తిరునాళ్ల గత నెల 26వ తేదీన నిర్వహించారు. లక్షలాది మంది పాల్గొన్నారు. ఇది గడిచి నాలుగు రోజులైనా పారిశుద్ధ్య కార్యక్రమాలు మాత్రం చేపట్టలేదు. కొండ దిగువున ప్రధాన రహదారులు వెంట చెత్త పేరుకుపోయింది. తాత్కాలిక దుకాణాలు, చెరకు రసం దుకాణాల వ్యర్థాలు పోగయ్యాయి. ప్రభల నిధి, అధికారుల తాత్కాలిక వసతి గృహాల ప్రాంతం వద్ద ప్లాస్టిక్ కవర్లు, పేపర్ టీకప్పులు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ప్రధాన సెంటర్‌లోని దుకాణాదారులు వ్యర్థాలను గోతాలలో రోడ్ల వెంట పడేశారు. అధికారులు వాటిని తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు అన్నవితరణ చేసి ఆకులను వదిలివెళ్లడంతో అవీ పోగయ్యాయి. ముక్కు మూసుకొని భక్తులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. పంచాయతీ రాజ్ శాఖ 350 మంది వరకు కూలీలను తిరునాళ్లకు విధుల్లో నియమించింది. సగం మంది కాంట్రాక్ట్ కార్మికులు. మూడు రోజుల పాటు వీరు కొండ దిగువున పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిరునాళ్ల అనంతరం అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఏటా తిరునాళ్ల ముగిసిన మరుసటి రోజు నుంచే పారిశుద్ధ్య పనులు జరిగేవి. వారం రోజులపాటు చెత్తను తొలగించేవారు. ఈ ఏడాది కనీసం ఇటువైపు చూసిన వారే కరవయ్యారు.

కూలీల కొరతే కారణం

తిరునాళ్ల ఏర్పాట్ల కోసం మండలంలోని కాంట్రాక్ట్ కూలీలతోపాటు రోజువారీగా కొంతమందిని నియమించాం. తిరునాళ్ల తరువాత కూలీలు అందుబాటులో లేకపోవడంతో పారిశుద్ధ్య పనులు ప్రారంభించలేదు. కాంట్రాక్ట్ కూలీలకు ఆరోగ్య సమస్యలు కూడా మరో కారణం. సోమవారం నుంచి వ్యర్థాలు తొలగించే పనులు ప్రారంభిస్తాం.

– నాగానంద్, ఈఓపీఆర్‌డీ, నరసరావుపేట మండలం

కార్మికులపై సర్దుపోటు!

- జీఎంసీలో పారిశుద్ధ్య కార్మికుల సర్దుబాటు
- యూనియన్ నాయకుల సిఫార్సుల మేరకే రేషనలైజేషన్!
- డబ్బులు ఇచ్చినవారికి దగ్గర వార్డులు!
- ఒక్కొక్కరి నుంచి రూ.10–15వేలు వసూలు చేసినట్లు ఆరోపణలు
- రేషనలైజేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



చెత్త తరలిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు(ఫైల్)

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పారిశుద్ధ్య కార్మికుల రేషనలైజేషన్ ప్రక్రియ ముగిసింది. వార్డులో ఎక్కువ ఉన్న కార్మికులను మిగతా చోట్ల సర్దుబాటు చేశారు. అయితే ఈ మార్పులో యూనియన్ నాయకులు కీలకంగా వ్యవహరించారు. తమ అనుకూలురుకు, మామూళ్లు ఇచ్చుకున్న వారికి వార్డుల్లో వారే కొనసాగేలాగా.. మామూళ్లు ఇవ్వనివారిని దూరంగా ఉన్న వార్డులకు మార్చారని వినికిడి. ఈ రేషనలైజేషన్‌పై పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

2011 జనాభాకు తగ్గట్టుగా కార్మికులు

2011 జనాభా లెక్కల ప్రకారం 7.50లక్షల జనాభాకు తగినట్లుగా ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. అయితే, 2012లో 10 గ్రామ పంచాయతీలను నగరపాలక సంస్థలో విలీనం చేశారు. దీంతో జనాభా మరింత పెరిగింది. ప్రస్తుతం నగరంలో సుమారు 11లక్షల పైబడి జనాభా ఉండగా, సుమారు 3 లక్షల దాకా హౌస్ హోల్డ్స్ ఉన్నాయి. నగరంలో ప్రస్తుతం 2011 జనాభాకు తగ్గట్టుగా 2వేల మందిలోపు మాత్రమే పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. గతంలో నగరంలో రోజుకు 400 మెట్రిక్ టన్నుల చెత్త వచ్చేది. ప్రస్తుతం సుమారుగా 470 మెట్రిక్ టన్నులకు ఇది పెరిగింది. ఈ చెత్తను బయటకు తీసుకెళ్లేందుకు తక్కువ సంఖ్యలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

500 మంది అవసరం

స్వచ్ఛ భారత్‌లో భాగంగా జాతీయ నిబంధనల మేరకు 350 ఇళ్లకు ఒక పుష్‌కాట్, ముగ్గురు వర్కర్లు ఉండాలి. అయితే ప్రస్తుతం ఇద్దరినే కేటాయించారు. ట్రాక్టర్‌కు నలుగురు నుంచి ఐదుగురు వర్కర్లు ఉండాలి. ప్రస్తుతం ఇద్దరే ఉంటున్నారు. దీంతో కార్మికులపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. ప్రస్తుతం ఉన్న జనాభాకు 500 మంది కార్మికులను అదనంగా తీసుకుంటేనే తప్పా నగరం బాగుపడదని జీఎంసీ వర్గాలు భావిస్తున్నాయి.

ఒక్కొక్కరి నుంచి రూ.10–15 వేలు వసూలు ?

రేషనలైజేషన్ ప్రక్రియ జరుగుతుందని తెలుసుకున్న కొందరు యూనియన్ నాయకులు నిరసన చేపట్టారు. దీంతో ఈ ప్రక్రియను అధికారులు వారికే అప్పగించారు. మామూళ్లు ఇచ్చుకుంటే మీకు నచ్చిన వార్డుల్లో వేస్తామని, లేకపోతే దూరంగా వెళ్లాల్సి వస్తుందని కార్మికులను బెదిరించారు. కొంతమంది కార్మికులు యూనియన్ నాయకులకు రూ.10 నుంచి 15 వేల దాకా ఇచ్చుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మామూళ్లు ఇచ్చుకోలేని వారు దూరం వార్డులకు వెళ్లారు. దీనిపై నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సత్తెనపల్లి: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంటర్ కాలేజ్ పవర్ లిఫ్టింగ్ టోర్నమెంట్ అండ్ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఎంపికలు గత నెల 27వ తేదీన నిర్వహించారు. ఈ పోటీల్లో పురుషుల జట్టులో ఎం.వినయ్ (66 కేజీల విభాగం), ఎస్.శరత్ (74 కేజీల విభాగం), మహిళల జట్టులో టి.జ్యోతి 76 కేజీల విభాగంలో బంగారు పతకాలు సాధించారు. టీమ్ ఓవరాల్ టైటిల్స్ స్ట్రాంగ్ మేన్‌గా ఎస్.శరత్, స్ట్రాంగ్ ఉమన్‌గా టి. జ్యోతి నిలిచారు. ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎస్.శరత్, టి.జ్యోతిలు ఎంపికయ్యారు. వారిని ఆదివారం పట్టణంలో ప్రత్యేకంగా అభినందించారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా సెక్రెటరీ పసుపులేటి సురేష్ మాట్లాడుతూ.. క్రీడాకారులు మరింత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ జిమ్ రాజు, క్రీడాకారులు కత్తి ప్రవీణ్, రాహుల్ గౌతమ్, సయ్యద్ మస్తాన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ బడుల పని వేళలు మార్చాలని డిమాండ్

నరసరావుపేట ఈస్ట్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉర్దూ పాఠశాలల పనివేళలు మార్చాలని ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంపత్‌బాబు, కె.కిషోర్‌లు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత మూడు దశాబ్దాలుగా రంజాన్ మాసంలో ఇలా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ అవుతున్నట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం రంజాన్ మాసం ప్రారంభమైనప్పటికీ ఉత్తర్వులు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ పాఠశాలల్లో దాదాపు రెండు లక్షల మందికిపైగా విద్యార్థులు, 10 వేల మందికిపైగా ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారని వివరించారు. రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉంటారని, దీనిని దృష్టిలో పెట్టుకొని వెంటనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

సస్పెన్స్ వీడింది !

- చెరువులో పడి కనిపించకుండా పోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం
- ఆదివారం ఉదయం చెరువులో తేలుతూ కనిపించిన మృతదేహం
- మొదట బాలుడిగా అనుమానం


ప్రభాకరరావు మృతదేహం

పర్చూరు(చినగంజాం): యద్దనపూడి మండలం పెద జాగర్లమూడి గ్రామ పరిధిలో శనివారం రాత్రి చెరువులో పడి వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై సస్పెన్స్ వీడింది. మృతదేహం ఆదివారం ఉదయం నీటిపై తేలియాడుతూ కన్పించింది. మృతి చెందింది బాలుడు కాదు వ్యక్తే అని పోలీసులు నిర్ధారించారు. శనివారం పెదజాగర్లమూడి ఎస్సీ కాలనీ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మునిగిపోతూ కన్పించాడని స్థానిక మహిళలు గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు విషయాన్ని పోలీసులకు తెలిపారు. శనివారం రాత్రి ఎస్‌ఐ మాల్యాద్రి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, రెస్క్యూ టీం చెరువులో ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. చెరువు గట్టుపై ఉన్న చెప్పులను బట్టి నీటిలో మునిగింది బాలుడా? వ్యక్తా? అని నిర్ధారణకు రాలేకపోయారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం చెరువునీటిలో తేలియాడుతూ ఓ వ్యక్తి మృతదేహం కన్పించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, స్థానికులు పరిశీలించారు. పెదజాగర్లమూడి ఎస్సీ కాలనీకి చెందిన బొందు ప్రభాకరరావు(42) అలియాస్ ప్రభుదాసుదిగా గుర్తించారు. బొందు ప్రభాకరరావు, దీనమ్మ భార్యాభర్తలు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇంటర్ చదువుకుంటున్న ఇద్దరు కుమార్తెలు ప్రవల్లిక, రెబెకా శనివారం పరీక్ష రాసేందుకు వెళ్లారు. భార్య దీనమ్మ అత్యవసర పనిమీద పుట్టింటికి వెళ్లింది. ఇంటి దగ్గరే ఉన్న ప్రభాకరరావు ఎస్సీ కాలనీ చెరువులో ముఖం కడుక్కునేందుకు వెళ్లి కాలు జారి నీటిలో పడి మునిగిపోయాడు. స్థానికులు మునిగిపోయిన వ్యక్తిని బయటకు తీసుకువచ్చేందుకు తీవ్రంగా గాలించారు. ఆదివారం ఉదయం నీటిపై తేలియాడుతూ మృతదేహం కన్పించడంతో అక్కడికి చేరుకున్న బంధువులు భోరున విలపించారు. ఆదివారంపోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చిరు వ్యాపారులకు అండగా నిలవాలి

ఐసీసీ అధ్యక్షుడి సన్మాన సభలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని


ఐసీసీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లను సత్కరిస్తున్న కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు

నగరంపాలెం: చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు సమష్టి నిర్ణయంతో చిన్న వ్యాపారులకు బ్యాంకు రుణాలు ఇప్పించే దిశగా పయనించాలని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ది ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన యేల్చూరి వెంకటేశ్వర్లుకు ఆత్మీయ సన్మాన మహోత్సవం, రజత కిరీటంతో ఆదివారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సత్కరించారు. తొలుత అతిథులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ కొత్తగా వ్యాపారాలు చేసే వారికి అవగాహన కల్పించాలని అన్నారు. బ్యాంక్ అధికారులతో మాట్లాడి రుణాలు ఇప్పించే దిశగా ముందుకెళ్లాలని సూచించారు. ఆన్‌లైన్‌లో డిజిటల్ మార్కెటింగ్ పై శిక్షణ అందించాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను వ్యాపారులకు వివరించాలని అన్నారు. క్రేన్ గ్రూప్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్ గతంలో కొంతమేర నిర్వీర్యమైపోయిందని అన్నారు. ఇప్పటికైనా ఎన్నికలు నిర్వహించి అధ్యక్షుడిని ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. ఇకనైనా సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా ఐసీసీకి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సన్మాన గ్రహీత ఐసీసీ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యాపారులకు అండగా ఉంటానని చెప్పారు. ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, కన్నా లక్ష్మీనారాయణ, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, ఐసీసీ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, డిప్యూటీ మేయర్ సజల, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, పోతురాజు సమత, నాయకులు కొనకళ్ల సత్యం, కొత్తూరు వెంకట్ పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులుగా వెచ్చా కృష్ణమూర్తి, దేవరశెట్టి సుబ్బారావులు వ్యవహరించారు.

చిన్నారిపై మైనర్ బాలుడు లైంగిక దాడి యత్నం

చెరుకుపల్లి: ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి జరిగిన ఘటన మండలంలోని ఆరేపల్లి పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం అదే గ్రామానికి చెందిన 16 సంవత్సరాల వయసు గల ఓ మైనర్ బాలుడు చిన్నారికి చాక్లెట్ ఆశ చూపి లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఆ చిన్నారి ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లి తల్లికి చెప్పింది. ఆమె వెంటనే తెనాలి ఏరియా హాస్పిటల్‌కు వైద్య పరీక్షల నిమిత్తం తీసుకువెళ్లినట్లు సమాచారం. దీనిపై స్థానిక ఎస్‌ఐను సంప్రదించగా చిన్నారి నాన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న గ్రామీణ కళారూపాలు



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్లలో ఐదు చోట్ల ప్రదర్శించిన సంప్రదాయ గ్రామీణ కళారూపాలు భక్తులను, యాత్రికులను ఆకట్టుకున్నాయని మంచి చిత్రాల అభిమాన సంఘం ప్రతినిధులు ఈదర గోపీచంద్, కంచర్ల నాగవీరయ్యలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాలివాహన సత్రంలో కావూరు గ్రామానికి చెందిన కళాకారులు గొట్టం ఆంజనేయులు దర్శకత్వంలో ప్రదర్శించిన బ్రహ్మం గారి నాటకం అలరించిందని తెలిపారు. కాకతీయ కళావేదికపై సినిమా పాటల కచేరీతోపాటు గయోపాఖ్యానం, శ్రీకృష్ణ రాయబారం, రామాంజనేయ యుద్ధం పౌరాణిక పద్య నాటకాలు ప్రదర్శించారని పేర్కొన్నారు. దివ్యాంగ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాటల కచేరీ, మిమిక్రీ, ఏకపాత్రాభినయాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. కావూరు ప్రభ వద్ద మహిళా కోలాటం, భట్రాజు సత్రంలో బ్రహ్మంగారి నాటకాన్ని ప్రదర్శించారని చెప్పారు. త్వరలో పట్టణంలో నిర్వహించే అభినందన సభలో వారిని సత్కరిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో సాంస్కృతిక వేదికపై ప్రదర్శనలు ఇవ్వలేకపోయామని పద్య కవి, నటులు ఈవూరి వెంకటరెడ్డి వాపోయినట్లు వివరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి ఐటీసీ ఎదురుగా తాడేపల్లి పోలీసులు గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లి ఎస్‌ఐ ఖాజావలి తెలిపిన వివరాల ప్రకారం ఐటీసీ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వృద్ధుడి మృతదేహం ఉందనే సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించామన్నారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, మృతుడి వయస్సు సుమారు 55–60 మధ్య ఉండవచ్చని పేర్కొన్నారు. ఎవరైనా గుర్తిస్తే తాడేపల్లి పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి



తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి-విజయవాడ రైలు మార్గంలో చిలువూరు స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో ఆదివారం రాత్రి తెనాలి రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 65 నుంచి 70 ఏళ్ల ఉంటాయని తెలిపారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడని భావిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలన్నారు.

రైలులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

దాచేపల్లి: రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైలులో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.వివరాలు.. ఆదివారం రేపల్లె నుంచి సికింద్రాబాద్‌కు రైలు బయలుదేరింది. మొదటి లగేజీ బోగీలో ఇనుపరాడ్‌కి ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రయాణికులు గుర్తించారు. గార్డుకు సమాచారం ఇవ్వటంతో రైలును నడికుడి స్టేషన్‌లో నిలిపివేశారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు వెళ్లి పరిశీలన చేయగా దుప్పటితో ఉరేసుకుని వ్యక్తి చనిపోయినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడిని బాపట్ల జిల్లా చీరాల మండలం చిన్న గంజాంకి చెందిన బాలిగ రాంబాబు(43)గా గుర్తించారు. లారీ క్లీనర్‌గా పని చేసేవాడని తెలిసింది. ఈ నేపథ్యంలో 15 నిమిషాలపాటు రైలును నడికుడి రైల్వేస్టేషన్‌లో ఆపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు


గాయాలపాలైన రామకృష్ణ, అరుణ, అనంతలక్ష్మి, సామ్రాజ్యం


ప్రమాదానికి గురైన కారు

దెందులూరు: వివాహానికి కారులో వెళ్లి తిరిగొస్తుండగా జరిగిన ప్రమాదంలో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఏలూరు జిల్లా దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్ద శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నివాసం ఉంటున్న ఊట్ల రామకృష్ణ కుటుంబసభ్యులు ఐదుగురు కలసి కారులో పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో వివాహానికి వెళ్లారు. అనంతరం శనివారం రాత్రి రాజమహేంద్రవరానికి బయలుదేరారు. అర్ధరాత్రి దాటాక రెండు గంటల సమయంలో ఏలూరు జిల్లా దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్దకు వచ్చారు. ఎదురుగా వెళుతున్న లారీని దాటేందుకు ప్రయత్నించగా, కారు అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ఊట్ల రామకృష్ణకు తలపై, ఆయన భార్య అరుణ కాలికి గాయాలయ్యాయి. రామకృష్ణ నాయనమ్మ అనంతలక్ష్మి, అరుణ అమ్మమ్మ సామ్రాజ్యం, వారి కుటుంబసభ్యుడు ఇరుసుమల్లి మణికంఠ కూడా గాయాలపాలయ్యారు. దెందులూరు ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు, హైవే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్సులో ఆశ్రం ఆస్పత్రికి తరలించారు. బాధితులకు చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శివాజీ తెలిపారు. డ్రైవరు నిద్రమత్తు వల్ల ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది.

9న తెలుగు సినిమా పాటల పోటీలు

సత్తెనపల్లి: చైతన్య కళా స్రవంతి 46వ వార్షికోత్సవ సందర్భంగా షేక్ షకీలా బేగం కళావేదికలో ఈ నెల 9న ఉదయం 10 గంటలకు జాతీయస్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు ఉంటాయని సంస్థ అధ్యక్షుడు లయన్ కమతం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. తొలి ముగ్గురు విజేతలకు రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు నగదు బహుమతులు అందిస్తామన్నారు. 10 మందికి రూ. 500 చొప్పున ప్రత్యేక నగదు బహుమతులు ఉంటాయన్నారు. వివరాలకు 93901 32978 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యువతితో అసభ్య ప్రవర్తన

సత్తెనపల్లి: యువతితో అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాలు.. మిరపకాయల కోతలకు ప్రకాశం జిల్లా దర్శి ప్రాంతానికి చెందిన 40 మంది కూలీలు నెల క్రితం వచ్చి పాకాలపాడు–బృగుబండ సమీపంలో గుడారాలు వేసుకొని జీవనం వెళ్లదీస్తున్నారు. కూలీలలో ఓ మహిళ అనారోగ్యం పాలవడంతో కుమార్తె ఇడ్లీ తెచ్చేందుకు సిద్ధమైంది. కూలీలను గ్రామానికి తీసుకువచ్చిన హనిమిరెడ్డి అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై ఆ యువతిని ఎక్కించుకొని వెళ్లాడు. ఇడ్లీ తీసుకొని తిరిగి వస్తుండగా వాహనం నడుపుతూనే వెనుక కూర్చున్న యువతిపై చేతులు వేసి అసభ్యంగా ప్రవర్తించాడు. గుడారాల వద్ద కాకుండా మరికొంత ముందుకు తీసుకెళ్లి ద్విచక్ర వాహనాన్ని ఆపి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించేందుకు యత్నించడంతో ఆమె పెద్దగా కేకలు వేస్తూ పరుగులు పెట్టింది. గుడారాల వద్దకు చేరుకొని జరిగిన ఘటనను తల్లిదండ్రులకు వివరించి విలపించింది. గ్రామ పెద్దలు వచ్చి రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని సత్తెనపల్లి రూరల్ పోలీసులు సందర్శించి, వివరాలు సేకరించారు.

రజకులకు బడ్జెట్‌లో అన్యాయం

సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపూడి జయరాం


జయరాం

బాపట్ల: లాండ్రీలు, దోబీఘాట్ల విద్యుత్ అవసరాలకు కూటమి ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడంపై రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపూడి జయరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బాపట్ల వచ్చిన జయరాం స్థానిక మీడియాతో మాట్లాడుతూ టీడీపీ రజకులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తుందన్నారు. రజకుల నిర్మాణాత్మకమైన అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వటం లేదన్నారు. లాండ్రీలకు ఇచ్చే 150 యూనిట్లకు, దోబీ ఘాట్లకు ఇచ్చే ఉచిత విద్యుత్ అవసరాలకు బడ్జెట్లో నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడంపై రాష్ట్రంలో రజకులు ఆగ్రహంతో రగిలిపోతున్నారన్నారు. రజకులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని తెలుగుదేశం ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఆర్థిక భారం పడని హామీలు నెరవేర్చే అవకాశం ఉన్నా, కూటమి ప్రభుత్వం రజకులకు మేలు చేసేందుకు సిద్ధంగా లేదన్నారు. కూటమి ప్రభుత్వానిది పెత్తందారుల ప్రభుత్వం కాబట్టే రజకుల ఈనాం భూముల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. రజకులకు ప్రత్యామ్నాయ భూములను కేటాయించడం లేదన్నారు. జగనన్న కాలనీలు, జగనన్న టౌన్స్ పేరుతో సేకరించిన కమ్యూనిటీ స్థలాల్లో రజకుల వృత్తి అవసరాలకు ప్రత్యేక స్థలాలను కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై కొత్తగా పడే ఆర్థిక భారం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేయూత కింద రజక వృత్తిదారులకు రూ.10 వేలు ఇచ్చారని, టీడీపీ పాలనలో రజకులు నిండా మోసపోయారని మండిపడ్డారు.

కూటమి ప్రభుత్వానిది దగా బడ్జెట్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చందోలు రాజ్‌కుమార్


రాజ్‌కుమార్

జె.పంగులూరు: ఎన్నో మోసపూరిత హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం, తప్పించుకునే వీల్లేక, రాష్ట్ర ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు చివరికి ఒక దగా బడ్జెట్ ప్రకటించిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చందోలు రాజ్‌కుమార్ దుయ్యబట్టారు. మండల పరిధిలోని పంగులూరులో ఆదివారం ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామన్న పథకం ఏమైందని ప్రశ్నించారు. తల్లికి వందనం అభాసుపాలైందని, అనేక కారణాలతో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గించే విధంగా చేస్తున్నారని తెలిపారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ కింద రూ.10 లక్షలు, ప్రతి మహిళకు రూ.1500 సంగతి ఎటు పోయిందని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. ఇప్పటికే రూ. లక్ష కోట్లు అప్పు చేసిన ప్రభుత్వం మరో రూ.80 వేల కోట్లు తీసుకురావాలని ప్రకటించడం సంపద సృష్టిలో భాగమా అని ఎద్దేవా చేశారు.

సాహితీ రత్నగా పెనుమాక నాగేశ్వరరావు


ప్రముఖ కవి పెనుమాక నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న సాహితీ మిత్ర మండలి

అద్దంకి రూరల్: ప్రముఖ కవి పెనుమాక నాగేశ్వరరావుకు సాహితీ మిత్రమండలి సాహితీ రత్న బిరుదును అందజేసింది. ఆదివారం స్థానిక చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవాసదన్‌లో సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి పెనుమాక నాగేశ్వరరావు రచనలపై పాలపర్తి జ్యోతిష్మతి, కుందుర్తి స్వరాజ్యపద్మజ విశ్లేషించారు. పెనుమాక నాగేశ్వరరావు మాట్లాడుతూ తానురచించిన నాన్న నువ్వు సున్నానా, ఫారెన్‌సెంటు, బార్‌తం, నైతరుణి, ఆలయం, దేవుడిపాట నవల గురించి వర్ణించారు. కార్యక్రమంలో యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, ఎ.లెవీ ప్రసాద్, ఆర్వీ రాఘవరావు, చందలూరి నారాయణ, పీసీ మెచ్ కోటయ్య, ఎల్.శివరావు, చప్పిడి వీరయ్య, ఎల్.శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు


మృతుడు పిట్టు బ్రహ్మారెడ్డి (ఫైల్)

చెరుకుపల్లి: ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదవశాత్తూ జాతీయ రహదారిపై డివైడర్‌కు తగిలి ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. పొన్నపల్లి గ్రామానికి చెందిన పిట్టు బ్రహ్మారెడ్డి(30), వారే నాగార్జునరెడ్డిలు ద్విచక్ర వాహనంపై చెరుకుపల్లి నుండి పొన్నపల్లి వెళుతున్నారు. ఇంటికి కొద్ది దూరంలోనే ప్రమాదవశాత్తు డివైడర్ తగలటంతో బ్రహ్మారెడ్డి తలకు తీవ్ర గాయాలై విపరీతంగా రక్తం పోయింది. నాగార్జునరెడ్డికి గాయాలు కావటంతో వెంటనే సమీపంలోని హాస్పిటల్‌కు తరలించారు. బ్రహ్మారెడ్డి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు బ్రహ్మారెడ్డికి ముగ్గురు ఆడ పిల్లలు, భార్య ఉన్నారు. బ్రహ్మారెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా తిరుపతిరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుపతిరావు

గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా చెరుకూరి తిరుపతిరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు లాల్‌పురం రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయం వాజ్‌పాయ్ భవన్‌లో జిల్లా పరిశీలకుడు శ్రీనివాసరాజు, ఎలక్షన్ ఆఫీసర్ చిగురుపాటి కుమారస్వామి, బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజుల ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా చెరుకూరి తిరుపతిరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషిచేస్తానని వెల్లడించారు. పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరవేసే విధంగా పార్టీని ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు జమ్ముల శ్యామ్ కిషోర్, నేరెళ్ల మాధవరావు, కొత్తూరి వెంకట సుబ్బారావు, మకుటం శివ, మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, యడ్లపాటి స్వరూపరాణి, ఈదర శ్రీనివాసరెడ్డి, టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, జిల్లా పదాధికారులు తదితరులు పాల్గొని తిరుపతిరావుకు అభినందనలు తెలిపారు.

మెప్పించని రాష్ట్ర బడ్జెట్

- సూపర్ సిక్స్ పథకాల అమలుకు తగిన నిధుల కేటాయింపు శూన్యం
- 70 శాతం మంది ఆధారపడిన సాగు రంగానికి 7 శాతమే నిధులా?
- చర్చా గోష్టిలో కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజాసంఘాలు ఆగ్రహం


మాట్లాడుతున్న పీడీఎం రాష్ట్ర కమిటీ నేత వెంకటేశ్వరరావు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ మెజారిటీ ప్రజలను మెప్పించలేకపోయిందని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. కేటాయింపులకు, ఖర్చులకు పొంతన లేని బడ్జెట్ అని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కోటప్పకొండరోడ్డులోని సీపీఎం కార్యాలయంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి అధ్యక్షతన రాష్ట్ర బడ్జెట్‌పై చర్చా గోష్టి నిర్వహించారు. పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 70 శాతానికిపైగా ఉన్న వ్యవసాయ రంగానికి ఏడు శాతం నిధులు కేటాయించడం సరికాదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో వరికెపూడిశెల ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం కూటమి నేతల ప్రాధాన్యతలు వేరని చెబుతోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వర్గాలకు ఇచ్చే రాయితీలు ఎన్నటికీ పేదలకు ఇవ్వబోమని చెప్పినట్లుగా బడ్జెట్ ఉందని తెలిపారు. బడ్జెట్ అంకెలు గారడీ మినహా మరేం కాదని అన్నారు. వరికపూడిశెల ప్రాజెక్ట్‌కు వెంటనే నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు కోసం సరైన కేటాయింపులు చేయలేదని విమర్శించారు. తల్లికి వందనం పేరిట ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, అన్నదాతా సుఖీభవ కింద ఏటా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని చెప్పినా అందుకు తగిన నిధులు కేటాయించలేదని అన్నారు. కేంద్రం ఇచ్చే మొత్తంతో కలిపి రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం మాట మార్చడం ప్రజల్ని వంచించడమేనని పేర్కొన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పచ్చవ రామారావు, సీఐటీయూ నాయకులు షేక్ సిలార్ మసూద్, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటనాయక్ ప్రసంగించారు.